# జానకమ్మరావి

## శ్రీనివాస ఆత్రేయ


అర్ధరాత్రి.

ఆకాశంలో చంద్రుడు లేక దిక్కు తోచక బిక్కుబిక్కు మంటున్నాయి చుక్కలు.

వరాంకుశం వాచీ చూసుకున్నాడు. రేడియమ్ డయల్ వాచీ సరిగ్గా పన్నెండు న్నర చూపిస్తోంది.

"ఒంటిగంటకల్లా కొత్తపేటలో వుంటాము" అనుకుంటూ నెమ్మదిగా సైకిల్ని రావులపాలెం జిల్లా పరిషత్ స్కూలు దాటించాడు. అక్కడ నుంచీ మొదలవుతుంది కొత్తపేటకిపోయే మట్టి రోడ్డు. ఆ రోడ్డుకి ఓ పక్క సన్నటి పంటకాలువ, మరోపక్క అరటితోటలు. అక్కడికి కొత్తపేట సుమారు 15 కిమీ దూరం వుంటుంది. కొత్తపేటకి, రావులపాలేనికి సరిగ్గా మధ్యలో వుంది 'జానకమ్మరావి.'

జుట్టు విరబోసుకున్న వెయ్యి చేతుల దయ్యంలాగ వుంటుంది ఆ రావిచెట్టు. ఆ రావికి తగ్గట్టుగా శిథిలావస్థలోవున్న ఓ పెంకుటిల్లు బాటసారుల్ని భయభ్రాంతులనుచేస్తూ వుంటుంది. పూర్వం ఎప్పుడో ఏదో భూమి తగాదాల్లో భర్తని చంపేస్తే, బతకడానికి మరో దారిలేక, యీ రావి చెట్టుకే చీరతో ఉరేసుకొని చనిపోయిందిట జానకమ్మ అనే ఆవిడ... అప్పటి నుంచీ దయ్యమై ఆ రావిచెట్టుమీదే వుంటూ, ఎవరైనా ఒంటరిగా రాత్రిపూట అటువైపువస్తే, కక్షకట్టి వాళ్ళ రక్తం తాగకుండా వదిలిపెట్టేది కాదుట అందు వలన క్రమంగా రాత్రిపూట జనసంచారం ఆ ప్రదేశంలో తగ్గిపోయింది. ఏదైనా అత్యవసరమైన పనివచ్చి రాత్రివేళ ఆ చెట్టు దాటవలసివస్తే యిద్దరు ముగ్గురు మనుషులు కలిసి, గట్టిగా ఆంజనేయ దండకం చదువుతూ గబగబా ఆ చెట్టు కిందనుంచీ తలఎత్తకుండా దాటిపోయే వారు. మాటల సందర్భం వస్తే ఆ రావి చెట్టుని 'జానకమ్మరావిగా' వ్యవహా



రించేవారు.

సైకిలు తొక్కుతున్న వరాంకుశానికి సాయంత్రం పల్లారెడ్డితో జరిగిన సంభాషణ గుర్తుకొచ్చింది.

"ఆ పరిస్థితుల్లో మా తాతగారు అంత రాత్రివేళ తప్పనిసరిగా కొత్తపేట వెళ్ళవల్సి వచ్చింది. వెంటనే ఎడ్లబండి కట్టించి బండికింద. బండిలో మా రెండు లాంతర్లు వేలాడతీశారు. దీపానికి దయ్యానికి పడదుట అందుకని మా తాతగారి దగ్గర మొండిధైర్యం వున్న ఓ పాలేరు వుండేవాడు. వాడుకూడా వెంట బయలుదేరాడు. అంతవరకూ హుషారుగా నడిచిన గిత్తలు రెండూ సరిగ్గా జానకమ్మరావి దాటి నాలుగు గజాలు వెళ్ళేసరికి కాళ్ళని ఎవరో కట్టిపడేసినట్లుగా ఆగిపోయార్ట. ఎంతకొట్టినా సరే ఒక్క అడుగుముందు కెయ్యకపోయేసరికి ఏమిటా సంగతి అని పరికించి చూస్తే కొంచెం దూరంలో రోడ్డుమీద అడ్డంగా ఓ నల్లటికుక్క నోరు తెరిచి నాలిక బయటపెట్టి పరమ భయంకరంగా వీళ్ళకేసి చూస్తోందిట. మా తాతగారు ఎంతవద్దన్నా వినకుండా కుక్కను తోలడానికి కిందకు దిగాడుట మా పాలేరు. అలా నాలుగు అడుగులు వేశాడో లేదో ఆ కుక్క ఒక్కసారిగా ఏనుగంత పెరిగిపోయి, ముందరి రెండు కాళ్ళూ పాలేరు భుజాలమీద వేసి కంఠనాళాలు పుటుక్కున కొరికిపారేసిందిట. అది చూస్తూనే మా తాతగారు బండిలోనే విరుచుకు పడిపోయారుట. తిరిగి నాలుగురోజుల తరువాత కళ్ళు తెరిచారు. ఆ రోజు బండిలో వుండిపోబట్టి బతికిపోయారు. లేకపోతేనా" అంటూ

పల్లారెడ్డి చెప్తూంటే అంతవరకూ విన్న పరాంకుశం మరింక ఆవేశాన్ని అణచుకోలేకపోయాడు.

"వాట్ నాన్సెన్స్! దయ్యాలూ, భూతాలూ అని నువ్వు చెప్తున్నది వింటూంటే మనం యిరవయ్యో శతాబ్దంలోనేనా సాగిపోతున్నది. ఇరవై ఒకటో శతాబ్దానికేనా అనిపిస్తోంది. సైన్సు యింతగా అభివృద్ధిచెంది ఓ పక్క యివన్నీ అభూతకల్పనలని నిరూపిస్తూ వుంటే, యింకా యిలాంటి జానకమ్మలాంటి కాకమ్మ కథలు నమ్ముతున్నారా? అసలు మిమ్మల్ని కాదు, మీకు ఇలాంటి కథలు చెప్పి మిమ్మల్ని నిర్వీర్యులని చేస్తున్నారే ఆ పెద్దవాళ్ళని అనాలి" అంటూ ఆవేశపడిపోయాడు దయ్యాలంటే నమ్మకంలేని పరాంకుశం.


"ఇదిగో పరాంకుశం! నువ్వు ఇక్కడికి నిన్నకాక మొన్నవచ్చావు. రేపు కాకపోతే ఎల్లుండి యిక్కడనుంచీ ట్రాన్స్‌ఫరయి వెళ్ళిపోతావు. నీకేం తెలుసు జానకమ్మరావిమీద దయ్యం వుందో లేదో? ఈ గడ్డమీద పుట్టిపెరిగిన మాకు తెలుసు. అంత సర్దాగా వుంటే ఓ రాత్రిపూట ఒంటరిగా ఆ రావిచెట్టు దాటి వెళ్ళి చూడు, తెలుస్తుంది" అంటూ పల్లారెడ్డి కూడా రెచ్చిపోయాడు.

అలా మాటామాటా పెరిగి పందెం వేసుకున్నారు యిద్దరూ. దాని ప్రకారం పరాంకుశం ఒక్కడూ అర్ధరాత్రి సైకిలు మీద రాఘులపాలెం నుంచీ కొత్తపేట వెళ్ళాలనీ, అలా వెళ్ళిన పక్షంలో పల్లారెడ్డి, పరాంకుశానికి మూడువందలు యివ్వాలనీ, ఒకవేళ వెళ్ళలేక వెనక్కి తిరిగి వచ్చేస్తే పరాంకుశమే పల్లారెడ్డికి అంత డబ్బూ యివ్వాలని. యిదిగో దాని పర్యవసానమే యీ ప్రయాణం.

ఒక్కసారిగా చల్లటిగాలి మొహానికి తగిలేసరికి వులిక్కిపడి ఈ లోకంలోకి వచ్చాడు పరాంకుశం. అంతవరకూ మినుకుమినుకు మంటున్న చుక్కలన్నిటినీ మింగుతూ నల్లటి మబ్బులు నలుమూలల నుంచీ కమ్ముకుంటున్నాయి. 'వర్షం వచ్చేటట్టు వుందనుకుంటూ సైకిలు స్పీడుగా తొక్కడం ప్రారంభించాడు.

దూరంగా అస్పష్టంగా కనిపిస్తోంది జానకమ్మరావి. దానిపక్కనే పాడుబడ్డ పెంకుటిల్లు యింతలో ఓ చిన్న మెరుపు మెరిసింది. ఒక్కక్షణంపాటు ఆ వెలుతురులో పెంకుటింటికేసి చూసిన పరాంకుశం వులిక్కిపడ్డాడు. ఆ యింటి మొండిగోడమీద ఓ స్త్రీ కూర్చున్నట్లుగా అనిపించింది. ఒక్క నిముషంపాటు ఆ స్త్రీ జానకమ్మ దయ్యంకాదు కదా అన్న ఊహ కలిగింది. అయితే మధ్యాహ్నం తాను పల్లారెడ్డికి చేసిన హితబోధ గుర్తుకి వచ్చి తన ఊహకి తానే నవ్వుకుంటూ సైకిల్‌ని రావిచెట్టుకిందుగా పోనిచ్చాడు.

ఆ రావిదాటి సరిగ్గా నాలుగుగజాలు




వెళ్ళాడో లేదో అంతవరకూ కాలువ ఒడ్డున కూర్చొని అరుస్తున్న కప్పలన్నీ ఒక్కసారిగా అరుపులు ఆపేశాయి. జరదపాము నోటచిక్కిన ఒక కప్ప మాత్రం బాధగా అరుస్తోంది హఠాత్తుగా అంత నిశ్శబ్దం ఏర్పడేసరికి పరాంకుశం కొంచెం జడిసాడు. తన సైకిలు వెనకనే ఎవరిదో అడుగుల శబ్దం వినిపిస్తే చటుక్కున వెనక్కి తిరిగాడు. అంతా భ్రాంతి, వెనకాతల ఎవరూ లేరు. మళ్ళీ కొంచెం దూరం వెళ్ళేసరికి యీసారి అడుగుల శబ్దం స్పష్టంగా వినపడింది. దానితోపాటు మువ్వలశబ్దం కూడా పరాంకుశం చెవిని పడింది. ధైర్యం కూడ గట్టుకొని నెమ్మదిగా వెనక్కితిరిగి చూడబోయాడు. యింతలో ఎప్పుడో విన్న ఓ సంగతి మెదడుపొరలు చీల్చుకొని బయటకు వచ్చింది

ఆ రోజు పరాంకుశం ఏదో పనిమీద బస్సులో ప్రయాణం చేస్తున్నాడు. తన పక్కన కూర్చున్న మోతుబరులిద్దరూ పిచ్చాపాటీ మాట్లాడుతూ సంభాషణ దయ్యాలమీదికి మళ్ళించారు. వద్దంటున్న వాళ్ళ మాటలు చెవినిపడ్తూనే వున్నాయి పరాంకుశానికి.

"నేనూ, వీరన్నా పట్నంనుంచీ తిరిగి వస్తున్నాం. బాగా చీకటి పడిపోయింది. దగ్గరదారి కదాని దయ్యాలబావి లేదూ అట్నుంచి పోదాం అన్నాడు వీరన్న. నా మనసులో భయం పీకుతున్నా వీరన్న వున్నాడన్న ధైర్యంతో సరేనన్నాను. దయ్యాలబావి దాటి కొంతదూరం నడిచామోలేదో వెనక నుంచి ఘల్లుఘల్లుమని గజ్జెల చప్పుడు వినిపించింది. వెనక్కి తిరిగి చూస్తే ఎవరూలేరు. మళ్ళీ నాలుగు అడుగులు వేసేసరికి యీసారి గజ్జెల చప్పుడు మా వెనకాతలే వినపడింది. దాంతో నాకు అర్థమయిపోయింది, యిది దయ్యాలబావిలోని దయ్యమేనని, వెనక్కితిరిగి చూడకు, చూసావో దెబ్బ కొట్టేస్తుంది అని వీరన్నతో చెప్తున్నా వినకుండా వెనక్కి తిరిగి చూసాడు.

అంతే, ఠప్పున ఎవరో వాడి వెన్నెముక మీద కొట్టిన శబ్దం వినపడింది. మనిషి విరుచుకు పడిపోయాడు. నేను వెనక్కి తిరిగి చూడకుండా ఒకటే పరుగందుకున్నాను. ఇల్లు చేరగానే నలుగురినీ పోగుచేసుకొని వీరన్న దగ్గరికి వచ్చి చూద్దును గదా” అంటూ ఆ మోతుబరి ఏదో చెప్పబోతూ దిగవలసిన స్టేషన్ రావడంవలన మూటాముల్లె సర్దుకొని దిగిపోయాడు.

ఇప్పుడు హఠాత్తుగా ఆ సంగతి గుర్తుకు రాగానే మరి వెనక్కి తిరిగి చూడడానికి సాహసించలేకపోయాడు. వెన్నులోంచి చలి పుట్టుకువచ్చింది. అంత చల్లటి వాతావరణంలోనూ చెమట్లు పట్టేశాయి. యీసారి అడుగుల శబ్దం, మువ్వల చప్పుడు వెనకాతలే వినిపించాయి. ఆ శబ్దం వినగానే శరీరంమీద వెంట్రుకలు భయంతో నిక్కబొడుచుకున్నాయి. రెండు చేతులూ సైకిల్ హాండిల్ మీద బిగుసుకుపోయాయి. భయం అన్నది ఒక్కసారి మనస్సులో నాటుకోగూడదేకాని, నాటుకుంటే అది క్షణాల్లో మహావృక్షం అయిపోతుంది.

అంతవరకూ నిద్రపోతున్న ప్రకృతి ఒక్కసారిగా ఒళ్ళువిరుచుకుంది. హోరుమని ఈదురుగాలి మొదలయింది యీ ఎదురు గాలిలో. ఇంకా మువ్వలశబ్దం చెవులలో గింగురుమంటూంటే, ప్రాణాలు అరిచేతిలో పెట్టుకొని, క్షణక్షణానికి పెరుగుతున్న భయంతో సైకిలు తొక్కేసరికి మనిషికి ఊపిరి అందడం కష్టమైపోయింది. నోటితో ఊపిరికే వగరుస్తున్నాడు. మనసు అక్కడనుంచి సాధ్యమయినంత తొందరగా పారిపోదామంటున్నా, భయంతో బిగదీసుకుపోయిన శరీరం మాత్రం అందుకు సహకరించడం లేదు. ఏదయితే అదయిందన్న మొండి ధైర్యంతో అక్కడ కాలవ పక్కగా ఓ 'మైలురాయి'లాంటిది కనిపిస్తే దానిపై కాలు ఆన్చి ఓ రెండునిమిషాలు విశ్రాంతి తీసుకుందామని, సైకిలు ఆ రాయిపక్కగా పోనిచ్చి రాయిపై కాలు ఆన్చాడు. కాలు కింద రాయి మెత్తగా తగిలేసరికి శరీరంలోని రక్తం ఒక్కసారిగా చల్లబడిపోయింది పరాంకుశానికి. కాలు ఆన్చిన మరుక్షణంలో భీకరంగా ఒక్క అరుపు అరచి మనిషెత్తుకు పెరిగిపోయిన ఆ రాయిని చూసేసరికి వల్లారెడ్డి చెప్పిన కుక్క సంగతి గుర్తుకువచ్చి గుండె లవిసిపోయేలా ఒక కేకవేసి సైకిలుమీద నుంచి స్పృహతప్పి కిందపడిపోయాడు పరాంకుశం.

* * *

హాస్పిటల్‌లో నీరసంగా కళ్ళు తెరచిన పరాంకుశానికి, తన మంచంకి కొంచెం దూరంలో ఎవరో అపరిచితుడు వల్లారెడ్డితో మాట్లాడుతూ కనపడ్డాడు. “రోజూ సాయంత్రం అరయ్యేసరికి మువ్వలు శబ్దం చేసుకుంటూ ఇల్లు




చేరుకొనే మా కర్రావు చిన్న అర్ధ రాత్రయినా యిల్లు చేరలేదండి. తెల్లారిందంటే వాడికవాళ్ళ పాలకోసం వచ్చేస్తారనిచెప్పి అంత రాత్రివేళా ఆవుని వెతకడానికి బయలుదేరానండి. వూరంతా వెతికి దొరక్కపోతే ఆఖరిగా జ్ఞాపకమ్మ రావికేసి వెళ్ళానండి. అయితే రావి దగ్గర కెళ్ళాలంటే భయంవేసి కొద్దిదూరంలో నించున్నానండి. యింతలో కడుపులో వులవరంగా అనిపిస్తే కాలవొడ్డుకుపోయి కూర్చున్నానండి. యిలా కూర్చున్నానో లేదో నామీద ఏదో బరువు పడేసరికి ఒక్క కేకవేసి విలుచుండిపోయానండి. యింతలో యీ బాబు సైకిలుమీద నుంచి దబ్బున పడిపోయాడండి యీ బాబు సైకిలు వెనకాతలే నా కర్రావుకూడా వచ్చేసిందండి." యిలా ఆ అపరిచితుడి వాక్ప్రవాహం సాగిపోతూనే వుంది. అయితే అప్పటికీ జరిగిందేమిటో అర్థమయిన వరాంకుశం వీరసంగా సీలింగు ఫ్యానుకేసి చూస్తుంటే ఆ ఫ్యానుకి మూడు రెక్కలుకి బదులుగా మూడువందనోట్లు గిర్రున తిరుగుతూ కనిపించాయి.

* * *